తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వ్యక్తిపై ఒంటరి ఏనుగు దాడి

బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



మండలంలో గత కొన్ని రోజులుగా సంచరిస్తున్న ఒంటరి ఏనుగు కుప్పనపల్లి గ్రామంకు చెందిన ఆవుల రంగప్ప అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరచింది. రంగప్ప ఆవులను అటవీ ప్రాంతంలో మేపేందుకు తీసుకెళ్లగా ఒంటరి ఏనుగు అతనిపై దాడికి దిగింది. ఇది గమనించిన ఆవులు ఏనుగును పొడిచే యత్నం చేశాయి. ఈసమయంలో రంగప్ప ఏనుగు నుంచి తప్పించుకున్నాడు. అనంతరం ఒంటరి ఏనుగు అక్కడ నుంచి అడవిలోకి వెళ్లిపోయినట్లు రంగప్ప తెలిపాడు. అటవీ అధికారులు ఒంటరి ఏనుగు బారినుంచి కాపాడాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## కరుణించని వరుణదేవుడు
### -ముగిసిన కారీరిష్టి యాగం

తిరుమల, సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:



వరుణదేవుడిని ఆవాహనం చేసుకుని మంచి వర్షాలు కురిసేందుకు తిరుమలలో చేపట్టిన ఐదు రోజుల కారీరిష్టి, వరుణ జపం, పర్జన్యశాంతి హోమాలు గురువారం ముగిసింది. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగించారు. అయితే 32 మంది ఋత్వికులతో చేపట్టిన ఈ హోమం సత్ఫలితాలు ఇవ్వలేదనేది భక్తుల్లో వినిపిస్తున్న అసంతృప్తి. మరీ ఈ హోమాలకు వర్షాలు కురవకపోతే ఎల్‌నినో తీవ్ర రూపం దాల్చుతుందని, తదుపరి ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయనేది ఆందోళనకరంగా మారింది.

# ఏసిబి నిఘాలో మరికొందరు!

## టిటిడిలో అవినీతి తిమింగలాల్లో గుబులు! డిప్యూటీ ఈఓ లోకనాథం అరెస్ట్‌తో కలకలం



ప్రభాతవార్త-తిరుపతి:
ధార్మికసంస్థ టిటిడిలో అటెండర్ స్థాయి నుండి డిప్యూటీ ఈఓ స్థాయి అధికారుల వరకు పలు రకాలుగా అవినీతికి అలవాటు పడి కోట్లు ఆర్జించారనే ఆరోపణలు ఇప్పుడు ఏసిబి వరకు చేరింది. ఇదివరకు గుట్టుచప్పుడు గాకుండా చాప క్రిందనీరులా జరిగి పోతున్న కొందరు ఉద్యోగుల అవినీతి తాజాగా తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథంపై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసిబి సోదాలు చేసి 5కోట్ల రూపాయలుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు తేల్చడంతో టిటిడిలో గుబులు రేగుతోంది. ఇప్పటికే పలు రకాలుగా దర్శనాల పేరుతో, తమ చేతివాటం చూపించి భారీ బహుళ అంతస్థుల ఇళ్ళు నిర్మాణం, సినిమాలు తీయడం, స్థలాలు, ప్లాట్లు వంటి విలువైన ఆస్తులు కొనుగోలు చేసిన అవినీతి ఉద్యోగుల చిట్టా ఏసిబికి ఉప్పందినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే నిజమైతే ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం తరువాత తదుపరి ఎవరిపై ఏసిబి నిఘా ఉంచిందనేది సర్వత్రా చర్చమొదలైంది. మొన్నటివరకు ఒక లెక్కఅని, ఇప్పుడు ఇప్పటికే ఏసిబికి అందిన సమాచారంతో ఇద్దరు డిప్యూటీ ఈఓ అధికారులు, ఏడుమందివరకు సూపరింటెండెంట్లు, ఆరేడుమంది ఏఈఓల జాబితా ఏసిబి వద్ద ఉందనేది ఉదంతం, మరీ ఇదే నిజమైతే వీరందరిపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై విచారణకు టిటిడి ఛైర్మన్, ఈఓ ఆదేశిస్తారా అనే అనుమానాలు ఉద్యోగవర్గాల్లో రేకెత్తుతున్నాయి. టిటిడిపై ఏసిబి నిఘా ఉంచి తనిఖీలు, సోదాలు చేసిన దాఖలాలు పదుల సంఖ్యలో కూడా లేదు. దీనివెనుక టిటిడి నుండి పోలీస్‌శాఖలో భాగమైన ఏసిబి కీలక ఉన్నతాధికారులకు వారి కుటుంబాలకు శ్రీవారి ప్రోటోకాల్ దర్శనాలు కల్పించడమేననేది సామాన్యభక్తుల్లో కూడా తెలిసిన విషయం. మరీ ఇప్పుడు ఆలయ డిప్యూటీ ఈఓపై ఏసిబి పంజా విసరడంతో తదుపరి ఎవరి వంతు రానుందనేది కూడా టిటిడిలో సంచనంగా మారింది. ఇప్పటికే ఎవరి పేర్లు ఉన్నాయి,ఎవరు ఎవరిపై ఫిర్యాదులు చేశారనేది అంతర్గతంగా ఆరా తీయడం చేస్తున్నారనేది ఉద్యోగుల్లో వ్యాఖ్యలు. ఇప్పటికే గతంలో తిరుమల జెఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌లుగా పనిచేసిన ఇద్దరు అధికారులతో బాటు ప్రస్తుతం అదనపు ఈఓ కార్యాలయంలో ఓ సూపరింటెండెంట్ ఆర్థిక వ్యవహారాలు, లావాదేవీలు, సంపాదన వంటి వివరాలు ఏసిబికి చేరిందనేది గుప్పుమంటోంది. ఆ తరువాత ఆయన వంతేనని టిటిడి ఉద్యోగుల్లో హాట్‌గా వినిపిస్తోంది. అక్రమార్కులైన అధికారుల్లో ఇప్పుడు ఏసీబీ దర్యాప్తు భయాందోళనలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు డిప్యూటీ ఈఓ లోకనాథం ఇంట్లో, తిరుమలలోని ఆయన కార్యాలయం, బంధువుల ఇళ్లతో కలిపి ఐదు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఏకకాలంలో సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. సోదాల్లో సుమారు 5 కోట్ల రూపాయలు విలువైన ఆస్తులకు సంబంధించిన వివరాలను ఏసీబీ గుర్తించడం విశేషం. ఇలా ఆస్తులు కూడబెట్టిన ఇతర ఉద్యోగులకు ఎలా సమకూరాయి అనే కోణంలోనూ దర్యాప్తు చేపట్టనున్నారనేది సమాచారం.

**అవినీతి తిమింగలాలకు హెచ్చరిక!:**

మినీ సచివాలయంగా కొనసాగుతున్న టిటిడి వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థలో పనిచేసే అధికారులపై అవినీతి ఆరోపణలు వెలువడటం భక్తుల్లో ఆందోళన కలిగించే అంశం. ఒక డిప్యూటీ ఈఓ స్థాయి అధికారిపై ఏసీబీ చర్యలు తీసుకోవడం, సుదీర్ఘంగా సోదాలు నిర్వహించడం ద్వారా "అవినీతిపై ఉక్కుపాదం" తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటివరకు తెరవెనుక వ్యవహారాలు నడిపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి తిమింగలాల్లో గుబులు మొదలైందనే చర్చ టిటిడి వర్గాల్లో సాగుతోంది.

**టిటిడిలో కీలకమైన ఒక్క అధికారి అరెస్ట్‌తో వ్యవహారం ముగుస్తుందా?**

లేక అవినీతి మూలాలను వెలికి తీసే పెద్ద దర్యాప్తుకు ఇది ఆరంభమనే సంకేతాలు వినిపిస్తున్నాయి. టిటిడి నుండి దర్శన మర్యాదలు వద్దనుకుంటే రాబోయే రోజుల్లో ఏసీబీ దర్యాప్తు సమాధానం చెప్పనుందనేది కూడా కొందరు ఉద్యోగుల్లో గుప్పుమంటోంది.

## నేడు నింగిలోకి
# జిఎస్ఎల్వి ఎఫ్ 17...
### - మూడు దశల్లో ప్రయోగం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త
శ్రీహరికోట నుంచి శుక్రవారం వేకువ జామున 2 గంటల 55 నిమిషాలకు ఇస్రోకు అత్యంత ప్రతిష్టాకరమైన జీఎస్ఎల్వీ ఎఫ్17 ప్రయోగం జరగనున్నది. ఇందుకు సంబంధించి బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. 27 గంటల 30 నిమిషాల కౌంటన్ అనంతరం ఈ ప్రయోగం జరగనున్నది. జిఎస్ఎల్వి ఎఫ్ 17ప్రయోగాన్ని మూడు దశల్లో పూర్తి చేసే విధంగా డిజైన్ చేశారు. ఇందుకు గాను 19 నిమిషాల సమయం పడుతుంది. 51.70 మీటర్ల పొడవున్న జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ భూమి నుంచి నింగికేగసే సమయంలో 420.5 టన్నుల బరువుతో ఉంటుంది. నాలుగు ద్రవ ఇంధన స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో మొదటి దశ ప్రారంభమవుతుంది 40 టన్నుల ద్రవ ఇంధనం నింపుతారు. 4 స్ట్రాప్ ఆన్ బూస్టర్ల తో కలిపి మొత్తం 160 టన్నుల ద్రవ ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 151.2 సెకండ్లలో ఈ రాకెట్ పూర్తి చేసుకుంటుంది. 420.5 టన్నుల బరువును భూమి నుంచి ఈ రాకెట్ తీసుకెళ్లాలి దీన్ని దృష్టిలో ఉంచుకొని మొదటి దశలో నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లతో పాటు కోర్ అలోన్ దశతో కలిపి 299 టన్నుల ద్రవ, ఘన ఇంధ్రంతో కలిపి మొదటి దశను పూర్తి చేసుకుంటుంది. రాకెట్ పై భాగంలో ఉపగ్రహానికి అమర్చిన హీట్ షీల్డ్ 171.20 సెకండ్లకు మొదటి దశ రెండో దశకు మధ్యలోనే విడిపోతాయి. 40 టన్నుల ద్రవ ఇంధన సహాయంతో రెండో దశ 293.08 సెకండ్‌లకు పూర్తవుతుంది. క్రయోజనిక్ దశలో 15 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1106.60 సెకండ్లలో మూడో దశ పూర్తవుతుంది. జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ద్వారా 1,117 కిలోల బరువు గల ఈవో ఎస్05 ఉపగ్రహాన్ని 19 నిమిషాలకు 28934 కిలోమీటర్ల ఎత్తులోని జియో ట్రాన్స్ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెడతారు. ప్రయోగానంతరం బెంగళూరులోని హసన్ లోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు ఉపగ్రహాన్ని తమ అధీనంలో తీసుకొని పనితీరును పర్యవేక్షించడంతో పాటు ఉపగ్రహాన్ని 36వేల కిలోమీటర్ల ఎత్తులోకి ప్రవేశ పెట్టడంతో ప్రయోగం పూర్తవుతుంది.

## సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ





కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరగనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా గురువారం ఆవిష్కరించారు. కాణిపాకం దేవస్థానంలో ఈనెల 14 నుండి అక్టోబర్ 4 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల ప్రచార కార్యక్రమంలో భాగంగా దేవస్థానం ముద్రించిన ఆహ్వాన పత్రికలను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. విజయవాడ లోని రాష్ట్ర సచివాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, దేవస్థానం ఛైర్మన్ వి మణి నాయుడు, ఈవో కే పెంచల కిషోర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఆహ్వాన పత్రికలను సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును వారు ఆహ్వానించారు. అలాగే చంద్రబాబుకు దేవస్థానం వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, జివై స్థానాచార్యులు పణిస్వామి, దేవస్థానం పాలకమండలి సభ్యులు సతీష్, ఐరాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు హరిబాబు నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నరసింహ నాయుడు, నాయకులు గిరిధర్ బాబు, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు అందజేశారు.

## ఆటో డ్రైవర్‌ను బెదిరించి దోపిడీ
### ఇద్దరు నిందితుల అరెస్ట్.. మరో ముగ్గురి కోసం గాలింపు



రేణిగుంట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త
రాత్రివేళ ఆటో డ్రైవర్‌ను అడ్డగించి, దాడి చేసి బెదిరింపులకు పాల్పడి నగదు, సెల్‌ఫోన్ దోచుకెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను గాజులమండ్యం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.పోలీసుల వివరాల మేరకు ఆగస్టు 31వ తేదీ రాత్రి సంత గేటు వద్ద పి. గుణశేఖర్ (20), గుండూరు లోకేష్ (21)లు తమ సహచరులతో కలిసి ఆటో డ్రైవర్‌ను అడ్డుకున్నారు. అనంతరం అతడిని బెదిరించి దాడి చేసి, అతడి వద్ద ఉన్న వివో వై20 సెల్‌ఫోన్, రూ.2,200 నగదును బలవంతంగా లాక్కెళ్లారు.ఈ ఘటనపై గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సెప్టెంబర్ 2న తేదీ రూరల్ సీఐ మంజునాథరెడ్డి నేతృత్వంలో గాజులమండ్యం ఎస్సై హరీష తమ సిబ్బందితో యోగానంద కాలేజీ సర్కిల్ సమీపంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దోపిడీ సొమ్మును నిందితులు!! పంచుకున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.500 నగదును స్వాధీనం చేసుకున్నారు.అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. దోపిడీకి గురైన సెల్‌ఫోన్‌తో పాటు కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు గమనించిన ప్రజలు వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని గాజులమండ్యం పోలీసులు సూచించారు.

### నిర్దేశిత గడువులోపు ఓటర్ల జాబితా
## ప్రత్యేక సమగ్ర సవరణ-2025 పూర్తి
### - కలెక్టర్ సుమిత్‌కుమార్



ఎలక్షన్ కమీషన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో గల వివిధ ప్రక్రియలను నిర్ణీత గడువులోపు అత్యంత పారదర్శకంగా పూర్తి చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతి నుండి గురువారం రాష్ట్ర ఎన్నికల ముఖ్య ప్రధాన అధికారి వివేక్ యాదవ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి జిల్లాలో మొత్తం పెండింగ్‌లో వున్నది 10,243 దరఖాస్తులు అని, జిల్లాలో 1,34,307 మందికి నోటీసులు జారీ చేయడం జరిగిందని, ఇందులో 1,24,064 నోటీసులను పరిష్కరించడం జరిగిందని వివరించారు. అలాగే పత్రాల సమర్పణలో జాప్యం వల్ల ఆగిపోయిన మిగిలిన కేసులను కూడా త్వరలో కొలిక్కితీసుకువస్తామన్నారు. అలాగే కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణకు సంబంధించి ఫారం-6లో 13,547, ఫారం-8లో 7,979 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయన్నారు. అలాగు ఫారం-7లో 481 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని నిర్ణీత షెడ్యూల్‌లోపు పరిష్కరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. అలాగే బుక్ ఆఫ్ కాల్‌లో వున్న 10 పెండింగ్ అంశాలను, ఎస్జీఎస్‌టికి సంబంధించిన ఐదు ఫిర్యాదులను తక్షణం పరిష్కరించడానికి అవసరమైన స్పష్టత వచ్చిందని, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన గడువులోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేస్తామని కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ కె.మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఎన్నికల తహసిల్దారు రాజేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### 5,6 వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో
## అందుబాటులో సిబ్బంది
### ..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్..



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త :
ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ - క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు గడువు పెంపు , ప్రత్యేక ప్రచార దినాల నిర్వహణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జూలై 1 ని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్ర మానికి సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించే గడువును సెప్టెంబర్ 10 వరకు పొడిగించడం జరిగింది. ఓటర్ల సౌకర్యార్థం పారదర్శకత కోసం సవరించిన షెడ్యూల్ ప్రకారం మరిన్ని ప్రత్యేక ప్రచార దినాలను ఖరారు చేశారు:
ప్రత్యేక ప్రచార దినాలు : 2026 సెప్టెబర్ 5,6వ తేదీలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటు: ఈ రెండు రోజులలో ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యక్షంగా అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ తెలియజేశారు. ఓటర్ల జాబితాలను పరిశీలించడం, మార్పులుచేర్పులను గుర్తించడం, కొత్త ఓటరు నమోదు/సవరణల కోసం దరఖాస్తులను స్వీకరించడం, మరియు ప్రజల సందేహాలను నివృత్తి చేసి తగిన మార్గదర్శకత్వం అందించడం జరుగుతుంది. విచారణల నిర్వహణ: పోలింగ్ కేంద్రాలు మరియు సంబంధిత ప్రాంతాలలో ఈఆర్వో, ఏ ఈ ఆర్ వో లచే ప్రత్యేకంగా విచారణ ప్రక్రియలు నిర్వహించడానికి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయబడతాయి. రాష్ట్రంలోని ఓటర్లందరూ, రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ విజ్ఞప్తి చేశారు.

## భక్తులకు అత్యవసరాల్లో సత్వర వైద్యసేవలు
### -టిటిడి అదనపు ఈఓ చౌదరి

తిరుమల, సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భక్తులకు మాఢవీదుల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన వైద్య సేవలు అందించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. ఈనెల 15 నుండి 23వ తేది వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భక్తులకు సమన్వయంతో సేవలందించాలని ఆయన ఆదేశించారు. మాడ వీధుల్లో భక్తులకు సమస్యలు తలెత్తితే పోలీసుల సమన్వయంతో సురక్షితంగా త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని చెప్పారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వైద్య సేవలు, రవాణా విభాగాలు, పోలీసుల భద్రతపై టిటిడి అదనపు ఈఓవెంకయ్య చౌదరి తన క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు.

# కౌంటర్లలో నో క్యాష్..ఫోన్ పేలో రూ.2000 దాటితే నో స్కాన్..

## బిల్ డెస్క్ యాప్ కనుమరుగు ....

తొట్టంబేడు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:
కొత్త సాంకేతిక పరిజ్ఞానం విధానాలతో సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారు. ఇందులో భాగంగా విద్యుత్ శాఖలో నూతనంగా ప్రవేశ పెట్టిన డిజిటల్ విధానాలతో సామాన్యులు, సెల్‌ఫోన్లు లేని వారి తిప్పలు వర్ణనాతీతంగా మారింది. డిజిటల్ పేమెంట్ పేరుతో సామాన్యులకు శాపంగా మారిన నూతన నిబంధన విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లులు కట్టడానికి నానా అవస్థలు పడుతున్నారు. గతంలా విద్యుత్ కార్యాలయంలో నేరుగా బిల్లులు చెల్లించే సౌకర్యం లేకపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు డిజిటల్ పేమెంట్ విధానాన్ని బలవంతంగా రుద్దుతున్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. సాధారణంగా విద్యుత్ బిల్లులు స్థానిక విద్యుత్ కార్యాలయంలోనే చెల్లించేవారు. వృద్ధులు, నిరక్షరాస్యులు సైతం కౌంటర్ వద్దకు వెళ్లి నగదు చెల్లించి రశీదు తీసుకునేవారు.అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. బిల్లు కట్టడానికి కార్యాలయానికి వెళ్తే సిబ్బంది బిల్లులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని, అంతా ఆన్లైన్లోనే కట్టాలి, ఫోన్ పే, గూగుల్ పే లో కట్టండి అంటూ హెచ్చరిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. పట్టణంలో చదువుకున్న యువతకు ఇది సులభంగా అనిపించవచ్చు, కానీ గ్రామీణ ప్రాంతాల ప్రజల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చాలా మంది వృద్ధులకు ఆండ్రాయిడ్ ఫోన్లు లేవు,ఉన్నా ఫోన్ పే,ఇంటర్నెట్ వాడటం తెలియదు.అలాంటి వారు బిల్లులు ఎలా కట్టాలి? గడువులోగా బిల్లు కట్టకపోతే అపరాధ రుసుము, కరెంట్ కట్ అంటూ బెదిరింపులు మరో వైపు. డిజిటల్ ఇండియా మంచిదే కానీ, డిజిటల్ అక్షరాస్యత లేని సామాన్యులకు ప్రత్యామ్నాయం చూపకుండా కౌంటర్ పేమెంట్‌ను పూర్తిగా నిలిపి



వేయడం ఎంత వరకు సమంజసమని ప్రజా సంఘాల నాయకులు నిలదీస్తున్నారు. ప్రభుత్వం డిజిటల్ పేమెంట్ అంటూ తీసుకొచ్చిన నూతన విధానం శ్రీకాళహస్తి విద్యుత్ వినియోగదారులకు శాపంగా మారింది. కరెంట్ బిల్లు కట్టాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. గతంలో ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో బిల్ డెస్క్ అనే యాప్ ద్వారా వినియోగదారులు సులభంగా బిల్లులు చెల్లించేవారు. అలాగే కార్యాలయాల్లో కౌంటర్ వద్ద నగదు చెల్లించే వెసులుబాటు ఉండేది. కాలక్రమేణా ఆ యాప్ కనుమరుగైంది. ఇప్పుడు అధికారులు అందరూ ఫోన్ పే, గూగుల్ పే లోనే కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు.

**..రూ.2000 దాటితే స్కాన్ ఫెయిల్ వినియోగదారుల ఆవేదన**

ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఫోన్ పే, గూగుల్ పే లలో బిల్లు స్కాన్ చేస్తే రూ.2000 కంటే ఎక్కువ మొత్తం ఉన్న బిల్లులకు స్కానింగ్ తీసుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. రూ.2500, రూ.3000 బిల్లు వచ్చిన వారు రెండు, మూడు సార్లు కట్టాల్సి వస్తోందని, అయినా లావాదేవీ విఫలమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గడువు దాటి అపరాధ రుసుము పడుతోంది. తొట్టంబేడు, ఏర్పేడు ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు, మహిళా రైతులకు స్మార్ట్ ఫోన్ లేక,ఉన్నా వాడటం తెలియక కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. "మాకు ఫోన్ పే లు తెలియవు బాబూ, డబ్బులు తీసుకోండి" అని వేడుకున్నా సిబ్బంది నిరాకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కౌంటర్ చెల్లింపులను పునరుద్ధరించాలని, ఆన్లైన్‌పరిమితిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## ఐఐటీలో అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ...సత్ఫలితాలనిస్తున్న కోర్సులు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: ఐఐటిలో అడ్వాన్స్డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ కోర్సులకు మంచి స్పందన వస్తుంది. దీంతో ఐఐటి డైరెక్టర్ డాక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ విద్యార్థులకు చదువుతో పాటు సామాజికాంశాలపై అవగాహన కల్గిస్తూ కొత్త కోర్సులకు శ్రీకారం చుడుతున్నారు. దాంతో ప్రవేశ పెట్టె ప్రతి కోర్సుకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తుంది. ఈ నేపథ్యంలో దేశంలోనే భవిష్యత్ ఇంధన రంగానికి నూతన దిశానిర్దేశం చేస్తూ ఐఐటీ తిరుపతి మరో ముందడుగు వేసింది. కాంపిటెన్సీ డెవలప్‌మెంట్ అండ్ అవుట్‌రీచ్ (సీడీవో) విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఈక్యాంపస్ ఎం.టెక్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ (ఏఈఎస్‌టీ) రెండో బ్యాచ్ ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ రెండో బ్యాచ్‌లో 21 మంది అభ్యర్థులు చేరారు. వీరిలో ప్రముఖ పారిశ్రామిక సంస్థ జెఎస్డబ్ల్యూ నుంచి 13 మంది, అమరరాజా నుంచి నలుగురు, మరో నలుగురు స్వయం ప్రాయోజిత అభ్యర్థులు ఉన్నారు. పరిశ్రమల నుంచి భారీగా చేరికలు ఉండటం ఈ కోర్సుకు ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తోంది. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. సీడీవో డీన్ ప్రొఫెసర్ అరుణ్ కె. తంగిరాల, అకడమిక్ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ శశిధర్ గుమ్మ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ రఘునాథన్ కె. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీడీవో అడ్వైజర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం గోర్తి వందన సమర్పణ చేశారు. ఈ ప్రోగ్రామ్‌కు డాక్టర్ బృందా మూర్తి, డాక్టర్ సౌరవ్ చక్రవర్తి కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ కోర్సు కరిక్యులమ్ పూర్తిగా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించామని, అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ రంగంలో నెలకొన్న సవాళ్లను అధిగమించేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలతో అనుసంధానమై ఈ రంగంలో ఐఐటీ తిరుపతిని ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

## పేట పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్ వితరణ




ఏర్పేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాలకు ఓ దాత ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. ఈ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మంచినీటి కోసం తిప్పలు పడుతున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు అభ్యర్థించారు. దాంతో గ్రామానికి చెందిన వంగనూరు కృష్ణప్ప మొదలి స్పందిచారు. వెంటనే రూ.21వేల విలువ చేసే ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను బహుకరించారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు షర్మిలాదేవి, విద్యార్థులు, పాఠశాల కమిటి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామాల్లో ప్రచార రథానికి విశేష స్పందన



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో ధర్మప్రచారానికి ఏర్పాటు చేసిన ప్రచార రథానికి గ్రామాల్లో ఘనస్వాగతం లభిస్తుంది. సాక్షాత్తు పార్వతీ పరమేశ్వరులు, శ్రీకాళహస్తీశ్వరుడు తమ గ్రామానికి వచ్చిన అనుభూతితో స్వాగతం పలుకుతున్నారు. వాడ వాడల్లో ప్రజలు అఖండ హారతులిస్తున్నారు. స్వామి అమ్మవార్లను భక్తితో పూజిస్తున్నారు. రథం వచ్చే మార్గంలో పరిశుభ్రం చేసి ముగ్గులు వేసి మామిడి తోరణాలతో ముస్తాబు చేసి స్వాగతం పలుకుతున్నారు. గురువారం శ్రీకాళహస్తి మండలంలోని ఎగువవీధి, బొక్కసం పాళెం, ఏర్పేడు మండలంలోని ముసలిపేడు గ్రామాల్లో రథం యాత్ర సాగినపుడు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సంబరాలు జరుపుకున్నారు.

## ఆర్టిస్టులు ప్రమోషన్లకు రావాలి : హీరో కృష్ణసాయి



శ్రీకాళహస్తి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: తన పోలీస్ కంప్లైంట్ సినిమా విజయానికి కృతజ్ఞతగా శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నానని హీరో కృష్ణసాయి, ప్రమోషన్లపై ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణసాయి గురువారం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ చిన్న సినిమాలను బ్రతికించేందుకు ప్రతి ఆర్టిస్టు ప్రమోషన్లలో పాల్గొనాలని కోరారు. తమ సినిమాకు వరలక్ష్మి శరత్ కుమార్‌కు పూర్తి పారితోషికంతో పాటు ప్రమోషన్లకు ఐదు రోజుల మొత్తం కూడా ఇచ్చామని, అయినా ఆమె రాలేదని తెలిపారు. రామ్ చరణ్ లాంటి పెద్ద హీరోలే ప్రమోషన్లకు వస్తున్నారని, అందరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. పోలీస్ కంప్లైంట్ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ లో కూడా ఆడుతోందని, త్వరలో ఇదే టీమ్ తో మరో సినిమా చేస్తున్నామని ఆయన తెలిపారు.

## చైతన్య పాఠశాలలో చిన్నికృష్ణుల సందడి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: పట్టణంలోని జయరాం రావు వీధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం చిన్నికృష్ణులు, రాధలతో కళకళలాడింది. పాఠశాల ఈజీఎం సురేష్ మాట్లాడుతూ కృష్ణాష్టమి పండుగ కేవలం వేడుక మాత్రమే కాదని, పిల్లలకు భారత ఇతిహాసాలు, భాగవతంలోని నీతి కథల గురించి అవగాహన కల్పించే గొప్ప సందర్భమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుకన్య, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, డీన్ సురేంద్ర, ప్రైమరీ మరియు ప్రీప్రైమరీ ఇన్చార్జ్లు మాధవి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి అపూర్వ స్పందన

**-పండుగ వాతావరణాన్ని తలపిస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పర్యటన**



పలమనేరు రూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మండలంలో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి చేపడుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం రెండో రోజు గురువారం లక్కనపల్లి, గొల్లచీమనపల్లి, ఆలపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాలలో పండుగ వాతావరణాన్ని తలపించేలా సాగింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ముఖ్యంగా గ్రామాలలోని మహిళలు, యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల సంతృప్తి చెందుతూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పర్యటన బైరెడ్డి పల్లి మండలంలో సాగుతోంది. మండల పరిధిలోని చాలా గ్రామాలకు రోడ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు దాదాపు అన్ని గ్రామాలలో రోడ్లు రెండేళ్లలో పూర్తి చేయడం జరిగింది. దీంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తమ గ్రామాలకు విచ్చేసిన ఎమ్మెల్యేను భారీ గజమాల లతో సత్కరిస్తూ ప్రజలు పూల వర్షం కురిపిస్తున్నారు. ఇలా ఉండగా ఎమ్మెల్యే సైతం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తూ మరోవైపు గ్రామాలలో ఇప్పటికి నెలకొన్న సమస్యలను తెలుసుకుంటూ పర్యటనలో ముందుకు సాగుతున్నారు. ప్రధానంగా లక్కన పల్లె పంచాయతీ పరిధిలో గ్రామస్తులు తమ ఆటపాటలు, సాంస్కృతి కార్యక్రమాలతో ఆయనను ఘనంగా ఆహ్వానించారు.

**- ఎమ్మెల్యే పర్యటనలో పలు ప్రారంభోత్సవాలు**

లక్కనపల్లి పంచాయతీలోని చిన్నపురం, పెద్దపురం, గడ్డిండ్లు, తొరడి, లక్కనపల్లి, శెట్టిపల్లి రామనపల్లి, గొల్ల చీమలపల్లి పంచాయతీ పరిధిలోని గడ్డిండ్లు, గాజీపేట, మురారిపల్లి, తావడ కుప్పం, గొల్ల చీమనపల్లి గానిపల్లి, ఆలకుప్పం పంచాయతీ పరిధిలోని మునిరాజపురం, నాచుకుప్పం, ఆలపల్లి, మూగనపల్లి, మిట్టపల్లిలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు ప్రారంభోత్సవాలు చేశారు. పిఎస్ రోడ్డు నుండి కేపీ రోడ్డు వరకు శెట్టిపల్లి, చిక్కనపల్లి అండ్ బురిశెట్టిపల్లి మీదుగా రూ. 3.09 కోట్లతో నిర్మాణం చేపట్టిన రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. పెద్దపురం గ్రామంలో రూ.4.65 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. లక్కనపల్లి గ్రామంలో 15 లక్షలతో నిర్మించిన సీమెంట్ కాలువను ప్రారంభించారు. శెట్టిపల్లి నందు 9.40 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. శెట్టిపల్లిలో 12 లక్షలతో నిర్మించిన అంగనవాడి నూతన భవనాన్ని ప్రారంభించారు. రామనపల్లిలో 8.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో పలమనేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి బాలాజీ, బైరెడ్డిపల్లి మండల నాయకులు కిషోర్ గౌడ, సుబ్రహ్మణ్యం శెట్టి, పళని, మంజునాథరెడ్డి, రఘుచంద్రగుప్త, సుబ్బారెడ్డి, మునస్వామి రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కాసరం వాసుల చిరకాల కోరిక నెరవేరపోతుంది



తొట్టంబేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: మండల చిరకాల స్వప్నం సాకారం కానున్నదని మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజనాయుడు గురువారం పత్రికల వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన్న నూతనంగా నిర్మించిన 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. నేడు శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కాసరం చుట్టూ ప్రక్కల గ్రామాల్లో గత కొనేళ్ళుగాలో ఓల్టేజి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. వ్యవసాయ మోటార్లు కాలిపోవడం గృహాల్లో విద్యుత్ పరికరాలు మొరాయించడం విద్యార్థుల చదువులకు రాత్రిపూట అంతరాయం ఏర్పడడం వంటి సమస్యలకు నిత్యకృత్యంగా మారిందని దీన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులు వేగం పుంజుకుని రికార్డు సమయంలో నిర్మాణం పూర్తయిందా. ఈ సబ్‌స్టేషన్ ప్రారంభంతో కాసరంతో పాటు చుట్టూ ప్రక్కల 10 గ్రామాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందనుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి తొట్టంబేడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

## పంచాయతీ ఎన్నికల సందడి షూరు!

తొట్టంబేడు సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబందించిన ముందస్తు ప్రక్రియ



తొట్టంబేడు మండలంలో వేగంగా సాగుతోంది. 3వ తేది నుంచి 6వ తేది వరకు మండలంలో ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బిసి ఓటర్ల జాబితాపై అవగాహన ఆమోద గ్రామసభలను డిప్యూటి ఎంపిడిఓ జి.భార్గవ్‌సత్యం ముఖ్యఅతిథిగా హాజరైసభను ప్రారంభించారు. ఈ క్రమంలో చిట్టత్తూరు గ్రామంలో గురువారం గ్రామసచివాలయం అధికారిని కె.శాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. గత నెల 29 నుంచి ప్రారభమైన క్షేత్రస్ధాయి విచారణ నేటితో ముగిసిందని ఆయన వెల్లడించారు. ముసాయిదా జాబితాపై ఓటర్లు తమ అభ్యంతరాలను ఫారం 2 ద్వారా కులం మార్పు కోసం, ఫారం 3 ద్వారా కొత్త పేర్ల చేర్పు కోసం, ఫారం 4 ద్వారా తమ పేరు తప్పుగా చేరిందని తొలగింపుకోసం దరఖాస్తులు చేసుకున్నారని వాటన్నింటిని ఎంపిడిఓల పర్యవేక్షణలో క్షుణ్ణంగా పరిశిలించి విచారణ పూర్తి చేశామన్నారు. విచారణలో అర్హులుగా తేలిన వారిలో గ్రామంలోని గ్రామసభల్లో బహిరగంగా చదివి ఆమోదం తీసుకుంటామని అనంతరం ఈ నెల 7వ తేదిన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## 3వ సెమిస్టర్ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల హవా

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి విద్యా చరిత్రలో ఆక్స్ ఫర్డ్ డిగ్రీ కళాశాల మరోసారి



తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఎస్వీ యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించారు. పట్టణ స్థాయిలోనే కాకుండా యూనివర్సిటీ స్థాయిలో అన్ని ప్రధాన గ్రూపుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఈ కళాశాల విద్యార్థులే కైవసం చేసుకోవడం విశేషం. ఫలితాల వివరాల్లోకి వెళ్తే బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో పి. శిరీష 8.59 పాయింట్లతో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించగా, షేక్ మొబీనా 8.25 పాయింట్లతో సెకండ్ ర్యాంక్, ఎ. వైష్ణవి 8.13 పాయింట్లతో థర్డ్ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. ఇదే విధంగా బీఎస్సీ బయోటెక్నాలజీ హానర్స్ విభాగంలో పి. చంద్రిక 8.28 పాయింట్లతో ప్రథమ స్థానంలో, జి. సాయి హర్షిత 7.82 పాయింట్లతో ద్వితీయ స్థానంలో, టి. సుజాత 7.70 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. బీకాం హానర్స్ విభాగంలో కూడా అదే హవా కొనసాగింది, కె. మహాలక్ష్మి 8.81 పాయింట్లతో యూనివర్సిటీ టాపర్‌గా నిలవగా, ఎస్.కె. మస్రత్ 8.70 పాయింట్లతో, ఏసీ ప్రత్యూష 8.66 పాయింట్లతో వరుసగా ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారు. ఈ అద్భుత ఫలితాల నేపథ్యంలో కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పాల్గొని ర్యాంకులు సాధించిన విద్యార్థులను మెమెంటోలతో సత్కరించి అభినందించారు. విద్యార్థుల కఠోర శ్రమ, అధ్యాపకుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల నోట సత్యసాయి పద్యాలు

ఏర్పేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో ఏర్పేడు మండలంలో



విద్యార్థులకు ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపే కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ్ నగర్ కాలనీ సమితి, సత్యసాయి భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని రెండు మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో సత్యసాయి పద్య సూక్తుల పోటీలు గురువారం ఘనంగా జరిగాయి. మండలంలోని ఒడ్డిమిట్ట గ్రామ మోడల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సత్యసాయి సూక్తులను రాగయుక్తంగా వినిపించి ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో కె.యశ్వంత్ ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, సి. వర్షిత ద్వితీయ స్థానంలో, పి.మోలిక్ తృతీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా మోదుగులపాలెం గ్రామ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పోటీల్లో ఎం. తేజశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, టి. పూర్విక ద్వితీయ, జి. జాన్ మైకేల్ తృతీయ బహుమతులు పొందారు. చిన్నారులు భక్తి శ్రద్ధలతో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. పాల్గొన్న విద్యార్థులందరినీ భజన మండలి సభ్యులు అభినందించారు.

## సాలీడు మాట రాసిన...వెంకటేశ్వర్లుకు సత్కారం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి అనే పేరు వెనుక ఉన్న శ్రీ అంటే సాలీడు, కాళం అంటే పాము, హస్తి అంటే ఏనుగు అనే పవిత్ర చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా పాట రూపంలో అందించిన శ్రీకాళహస్తికి చెందిన చెన్నూరు వెంకటేశులుకు అరుదైన గౌరవం దక్కింది.



గురువారం తిరుపతికి చెందిన ప్రముఖ గ్రీన్ హోమ్ డెవలపర్స్ అధినేత రవి చంద్ర ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. శ్రీకాళహస్తీశ్వరుడికి భక్తితో సేవ చేసిన సాలీడు త్యాగ చరిత్రను పాట రూపంలో రాసి అందరికీ తెలిసేలా చేసినందుకు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రవి చంద్ర మాట్లాడుతూ ఆధ్యాత్మిక చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్తులో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిపై కూడా ఇలాంటి భక్తి గీతాలను రాయాలని ఆయన చెన్నూరు వెంకటేశులుకు సూచించారు. ఈ సత్కారం పట్ల పలువురు పాత్రికేయులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎంజీఎంల్లో చిన్నికృష్ణుల సందడి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోనిఎంజీఎం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా బాలకృష్ణుల కోలాహలంతో కళకళలాడింది.




విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణలో వచ్చి ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ మన సనాతన ధర్మం ఎంతో గొప్పదని, మన పండుగలను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో, గౌరవంగా జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సువర్ణముఖి నూతన కట్టపై నుంచి... జారిపడ్డ మందుబాబు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని సువర్ణముఖి నది నూతన కట్టపై గురువారం ఓ మందుబాబు తప్పతాగి జారిపడిన ఘటన చోటుచేసుకుంది. అతిగా మద్యం సేవించి కట్టపై నడుస్తుండగా కాలు జారి పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకుని ఆ గుర్తు తెలియని వ్యక్తిని స్ట్రక్చర్ మరియు దారాల సహాయంతో బయటకు తీశారు.

## కందాటి సుందర రామిరెడ్డికి నివాళులు

తొట్టంబేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి గ్రామానికి చెందిన వైకాపా



మద్దతుదారుడు, ప్రముఖులు కందాటి సుందర రామిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి గురువారం పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుందర రామిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

## సుశిక్షతుడైన నాయకుని పోగొట్టుకున్నాం

ఏర్పేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలో ఓ క్రమశిక్షణ, సుశిక్షితుడైన నాయకునికి



తెలుగుదేశం పోగొట్టుకుందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. కందాడు గ్రామానికి చెందిన జిపాళెం మునిరెడ్డి హఠాన్మరణం చెందారు. కందాడు పరిసరాల్లో పార్టీ కోసం కట్టుబడి పని చేసే ఓ మంచినాయకునికి పోగొట్టుకున్నామని ఎంఎల్‌ఏ ఆవేదన వ్యక్తం చేసారు. ఆయన పార్థీవ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ మునిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబాన్ని ఓదర్చారు. ఎంఎల్‌ఏతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, కేతినేని సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫోటో -ఎస్‌కెహెచ్‌టి 11